క్లుప్తంగా

నిడదవోలులో 27 బాణసంచా దుకాణాలు

నిడదవోలు: ఆదివారం దీపావళి సందర్భంగా పట్టణ వాసుల కోసం కోటసత్తెమ్మ ఆలయం వెనుక ఉన్న ఖాళీ ప్రాంగణంలో 27 బాణ సంచా విక్రయ దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తహసీల్దార్ ఎం.గంగరాజు శనివారం తెలిపారు. నిడదవోలు అగ్నిమాపకాధికారి వి.శ్రీనివాసరావు బాణసంచా సామగ్రి షాపులను తనిఖీ చేస్తారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని వ్యాపారులకు తహసీల్దార్ సూచించారు. బాణసంచా షాపుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై పి.నాగరాజు వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

సీహెచ్‌సీకి జగనన్న సురక్ష రిఫరల్ రోగులు

నల్లజర్ల: మండలంలోని నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలో జగనన్న సురక్ష వైద్య శిబిరాల్లో వైద్యులు సూచించిన రిఫరల్ కేసులను శనివారం గోపాలపురం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. 18 మంది రోగులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి వారిని తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు అనంతరం మళ్లీ అదే బస్సులో తీసుకు వచ్చారు. వారందరికి నల్లజర్ల వైద్యబృందం భోజన ఏర్పాట్లు చేసింది. వచ్చే వారం మరికొన్ని కేసులను ఏలూరు ఆసుపత్రికి తరలించనున్నట్టు పీహెచ్‌సీ డాక్టర్లు తెల్లం గంగాధరరావు, సిరాజుద్దీన్, సీహెచ్ఓ ప్రసాదరావు తెలిపారు.

పీఆర్సీ, కరవు భత్యం బకాయిలు చెల్లించాలి

నల్లజర్ల: రిటైర్డ్ ఉద్యోగుల సంఘ మండల శాఖ సమావేశం శనివారం నల్లజర్లలో జరిగింది. సంఘాధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం పీఆర్సీ, కరవు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి కృషి ఫలితంగా ప్రతి జిల్లా ఖజానా అధికారి నెలలో ఏదో ఒక రిటైర్డు ఉద్యోగుల సంఘ సమావేశానికి హాజరు కావాలని చేసిన ప్రయత్నం వల్ల పింఛనుదారుల సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఐవీ సత్యం అన్నారు. సంఘ మండల శాఖ సహాధ్యక్షుడిగా ఈ. ప్రసాదరావును ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్



గోపాలపురం మండలం దొండపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గ్రామాల్లో జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం దొండపూడిలో ఇంటింటా పర్యటించాయి. గత నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి గ్రామస్తులకు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఆ పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, బీసీ నాయకుడు కాసాని సోమరాజు, మండల యూత్ అధ్యక్షుడు కె.నానీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు మారాజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని రెండో రోజు శనివారం సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, ఉప సర్పంచ్ దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకూ వెళ్లి రాష్ట్రానికి మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు నామ ప్రకాశం, పసలపూడి రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశంలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- టీడీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడిపై మండిపడిన సొంత పార్టీ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు రత్నాజీ

ద్వారకా తిరుమల: కొందరు టీడీపీ నేతలు పార్టీలో కష్టపడుతూ జెండా మోస్తున్న అసలైన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా, అనర్హులను వెనకేసుకుని తిరుగుతూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు యిమ్మడి రత్నాజీ అన్నారు. స్థానిక వైష్ణవి అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన అసమ్మతి నాయకుల విలేకరుల సమావేశంలో రత్నాజీ మాట్లాడారు. కష్టకాలంలో టీడీపీకి తాము అండగా నిలిచామన్నారు. గతంలో పార్టీ పదవులు అనుభవించి, పార్టీ కార్యక్రమాల్లో పైరవీలు సాగించిన నేతలు కొందరు గత నాలుగున్నరేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నారన్నారు. అయినా తాము పార్టీని భుజస్కందాలపై మోస్తూ వచ్చామన్నారు. అలాంటి తమను ప్రస్తుతం కొందరు నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతూ, ఇప్పటి వరకూ ఇంట్లో పడుకున్న నాయకులను బయట తిప్పుతూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. ఈ విషయాలను పార్టీ అధినాయకుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరాకుల బుజ్జి మాట్లాడుతూ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు ఈనెల 9న ద్వారకాతిరుమల ఎస్సీ కాలనీలో, 10న బీసీ కాలనీలో బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారన్నారు. అయితే అందులో బీసీ ఎస్సీ, మైనారిటీలు, కాపులను కలుపుకోకుండా చంద్రబాబు దృష్టిలో పడేందుకు మాత్రమే కార్యక్రమాలను జరిపి, పార్టీని ఉద్ధరించినట్టు సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు లంకా సత్యనారాయణ తన సామాజిక వర్గం వారిని మాత్రమే వెనకేసుకొస్తూ పార్టీని నాశనం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ అధిష్టానం దృష్టిలో పెట్టుకుని అందరికీ ఆమోదయోగ్యమైన మంచి ఎమ్మెల్యే అభ్యర్థిని గోపాలపురం నియోజకవర్గానికి ఇవ్వాలని కోరారు. టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రేపూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు కొరపాటి వెంకన్న, తాడేపల్లి సుబ్బారావు, కాపు నాయకులు గువ్వల మావుళ్లు, గువ్వల చంద్రం, వీరిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్ర.. సమస్యలపై చర్చ

నల్లజర్ల: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం రాత్రి ఘంటావారిగూడెంలో పల్లె నిద్ర చేశారు. ఈ గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు ఇమ్మణ్ణి సత్తిపండు ఇంట రాత్రి బస చేశారు. పల్లెనిద్రకు ముందు, తర్వాత కూడ వైఎస్సార్ సీపీ ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు. హనుమాన్ కాలనీలో రహదారుల గురించి స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీను ఆధునీకరించాలని పలువురు నాయకులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం నిద్ర లేవగానే ఎమ్మెల్యే తలారి బైక్‌పై స్థానిక నాయకులతో గ్రామం అంతా తిరిగారు. మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మటపర్తి రామకృష్ణ, నాయకులు ఇమ్మణ్ణి సత్తిపండు, యలమర్తి వాసు, ఈలప్రోలు చంద్రరావు, తోట వెంకట్రావు, జువ్వలపాలెం అన్నవరం, సుదర్శనం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- దొమ్మేరు–1 సచివాలయం పరిధిలో గడప గడపకూ..



దొమ్మేరులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో అర్హత కలిగిన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దొమ్మేరు–1 సచివాలయం పరిధిలో శనివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మంత్రి ఇంటింటికీ వెళ్లి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆమె ప్రజలను కోరారు. గణేష్ కాలనీలో నూతన వధూవరులను దీవించారు. కూరగాయల దుకాణంలోకి వెళ్లి కూరగాయల ధరలు తెలుసుకుని కొద్దిసేపు కూరగాయలు విక్రయించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, సర్పంచ్ తానేటి కుమారి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణపాల్గొన్నారు.

యూటీఎఫ్ తాళ్లపూడి మండల నూతన కార్యవర్గం

తాళ్లపూడి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా ఎం.రాజకుమారి, అధ్యక్షుడిగా టి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడిగా కె. ప్రసన్నకుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా బి.విజయబాబు, కోశాధికారిగా టి.వెంకటరమణ ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా బి.శంకరరావు, మౌనిక, కె. శ్రీనివాస్, కె.గణేష్, టి.సాయిచంద్ర, కె .సుమన్, కాంతకుమారి, కె.బోడయ్య, కె. రాంపండులను ఎన్నుకున్నారు. సమావేశంలో జె.లక్ష్మీపతి, సీహెచ్ అనితా పూర్ణిమ, వీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండల శాఖ

నల్లజర్ల: యూటీఎఫ్ నల్లజర్ల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పల్లి వెంకట అప్పారావు, అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా కె.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా బి.కిశోర్, కోశాధికారిగా జి.కృష్ణబాలాజీ, కార్యదర్శులుగా హేమంత్‌కుమార్, డి.మోహన్‌రాజు, టి.నాగేశ్వరరావు, టీబీ మరియదాసు, టి.స్వాతి, ఎస్.వీర్రాజు, ఎన్.ఉమామహేశ్వరరావు, బి.వరలక్ష్మి, ఎల్.నాగరాజు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శంకరుడు, పరిశీలకుడిగా జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్ మనోహరకుమార్ వ్యవహరించారు.

రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలి

- కొవ్వూరులో రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి డిమాండ్
- భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

కొవ్వూరు: కరోనా సమయంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో రద్దు చేసిన కొన్ని రైళ్ల హాల్టులను వెంటనే పునరుద్ధరించాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. రైళ్ల హాల్ట్ పునరుద్ధరణ డిమాండ్‌పై భవిష్యత్తు కార్యాచరణ కోసం శనివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద వివిధ సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. భవిష్యత్తులో నియోజకవర్గ పరిధిలో కరపత్రాల ప్రచారం, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలని తీర్మానించారు. మేధావి వర్గం నుంచి రిటైర్డు ఇస్రో శాస్త్రవేత్త తాతయ్య బాబు, చార్టర్డ్ అకౌంటెండ్ డీఆర్ఎస్ఎన్ శాస్త్రి, రాజకీయ పక్షాల నుంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాకా పుల్లారావు, టీడీపీ తరపున మరపట్ల కళాధర చక్రవర్తి, వైఎస్సార్ సీపీ నుంచి చిలంకుర్తి వెంకట సుబ్బారావు (బాబీ), బర్ల శ్రీనివాస్, సీపీఎం నుంచి ఎం.సుందరబాబు, బీజేపీ తరపున పిల్లలమర్రి మురళీకృష్ణ, కొండపల్లి రత్నసాయి, ఉద్యోగ సంఘం తరపున యాళ్ల నాగేశ్వరరావు, రిటైర్డు ఉద్యోగ సంఘం తరపున వీటీ విల్సన్‌రాజు పాల్గొన్నారు.

గంట ముందుగా తాగునీటి సరఫరా

నిడదవోలు: కార్తిక మాసం సందర్భంగా నిడదవోలు పట్టణ ప్రజలకు సకాలంలో తాగునీటిని అందించేందుకు నీటి సరఫరా వేళల్లో మార్పులు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి శనివారం తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటలకు ఇచ్చే నీటి సరఫరాను ఈనెల 14 నుంచి డిసెంబర్ 12 వరకూ గంట ముందుగా, అంతే సాయంత్రం నాలుగు గంటల నుంచి సరఫరా చేస్తామని చెప్పారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్ట్

కొవ్వూరు: పట్టణంలో శ్రీనివాసపురం ప్రాంతానికి చెందిన నడిపల్లి సత్యనారాయణ అనే వ్యక్తిని తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లతో శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. ఎస్సై జి బసంతి, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారని ఆయన చెప్పారు.

మాదిగ యుద్ధభేరి పోస్టర్ విడుదల

నల్లజర్ల: విజయవాడలో ఈనెల 30న నిర్వహించే మాదిగ యుద్ధభేరి సదస్సుకు భారీగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రావు మాదిగలను కోరారు. నల్లజర్లలో శనివారం ఆయన మాదిగ శ్రేణులతో కలసి యుద్ధభేరి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు నాయకత్వంలో నిర్వహించే ఈ సదస్సుకు జాతీయ స్థాయి నాయకులు హాజరవుతున్నట్టు వెంకట్రావు చెప్పారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ గెల్లా వెంకట శ్రీను మాదిగ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలన్నారు.